కథానిక

# రైలు పడిపోయింది

"మంజుశ్రీ"

అమావాస్య అర్ధరాత్రి మసిపూసినట్లుగా నల్లగా వుంది రాత్రి నాలుగు దిక్కులా చీకట్లు తరుముకొస్తున్నయి. చీకటి అంతా చీకటి. నల్లటి చీకటి. కాలసర్పం కదలి ముందుకు పోతున్నది. పోతూనేవుంది. కోటి పడగలెత్తి బుస్సుమంది. ఆ పడగలు ఆకాశాన్ని తాకినయి. ఆకాశంలో మెఱుపులు మెరిసినయి. ఆ మెఱుపుల్లో వేల కొలది తళతళలాడే బాకులు మెరిసినయి. సన్నగా గణగణ గంటలధ్వని విన్పించింది. దిక్కులన్నీ కదలిపోయినయ్. పట్టాలమీద పోయే రైలు నదిలో పడిపోయింది. పాతాళంలోంచి వచ్చిన ఆక్రందనలు, ఆకాశమంతటా ఆవరించిపోయినయి. రైలు పడింది. రైలుపడింది.

* * *

ప్రొద్దుట కాఫీ తాగుతుండగా పేపరొచ్చింది. పేపర్లో మెయిన్ హెడ్డింగు రైలు పడిపోయింది. గుండెల్లో ధ్వనించింది అమ్మో! రైలుపడిపోయింది.

పాపం!

ఈ పాపం ఎవరిది? వున్న వొక్క కొడుకూ, చచ్చిపోతే కండ్లు లొట్టలు పడేటట్లుగా యేడ్చే తల్లి దండ్రుల పాపం, ఎలాంటిదో? యవ్వనంలో, ఎన్నో తీయని కలలనుకంటూ, ముందు బ్రతుకు నందనో ద్యానసుందర భూముల్లో పండించుకోవాలని తాపత్రయపడే ప్రియురాలు, ప్రియుడదే రైల్లో వస్తున్నాడని వింటే గుండెలు కొట్టుకోదూ? మనసులో వూహించుకొని, మాటల్లో తలచుకొని, గుండెల్లో నింపుకొని, వెన్నెల్లో విహరిద్దామనుకున్న ప్రియుడు, ప్రియురాలు, అదే రైల్లో తన దగ్గరకు వస్తున్నదని వింటే, పిచ్చెక్కిపోదూ? తల్లిని పోగొట్టుకున్న కొడుకూ, తండ్రిపోయిన కూతురూ, భర్త పోయిన భార్యా, పిల్లయిపోయిన తల్లీ, తల్లి పోయిన పిల్లలూ ఎలా విలవిలలాడతారో?

కొడుకూ, కోడలూ పండక్కు యింటికి వస్తారు కదా అని స్టేషనుకు పరుగెత్తేవాళ్ళూ, కూతురూ, అల్లులూ పండక్కు వస్తున్నారని యింట్లో కోలాహలం చేస్తుండేవాళ్ళూ, శలవలకు పిల్లలు యింటికి వస్తారుకదా, అని తాపత్రయపడే అమ్మా, నాన్నా యీ సంగతి వింటే అదిరి పడతారు.

వివరాలన్నీ చదివాను. మనసు వికలమై పోయింది. ఏం చేస్తాను.

* * *

వారం రోజుల ముందునుంచీ, ఆయన కళ్ళల్లో కదుల్తున్నారు జలజకు. ప్రొద్దున్నే లేచి, వొప్పిగ్గా, పక్కన్నా దిగకుండానే, ఆయన యింకా ఎన్ని రోజుల్లో వస్తారో వేళ్ళుచూసి లెక్కపెట్టుకుంటుంది జలజ. మళ్ళీ మొహం కడుక్కునేటప్పుడోసారి ఆయన చేసే కొంటెపనులు గుర్తొస్తయి.

ఈసారి వూరుకునేది లేదు. వారిని బ్రతిమిలాడి, వొప్పించి వారితోనే వెళ్ళిపోతుంది. ఆయనక్కడా? తానిక్కడా? వొకరిమీద ఇంకొకరు ప్రాణాలు పెట్టుకొని యిలా ఎంత కాలం.

చేసినపనే పన్నెండుమాట్లు చెయ్యడం మొదలెట్టింది జలజ. అన్నం తింటూ, ఏదో ఆలోచిస్తూ కూచోటం, కుంకుండబ్బా యిలాతే జలజా అంటే, అమ్మకు స్పాదుచుక్క తీసుకపోయి యివ్వటం ఏపని మొదలెడితే, దానిలోనే కూరుకుపోయి వుండటం, యివన్నీ చూసి అమ్మ నవ్వేది.

నర్మద అక్కను వేళాకోళమాడేది. "ఏమేవ్ అక్కా, బావొస్తున్నాడంటే వొళ్ళే మరచిపోతున్నావు." అనేది నర్మద. జలజపొంగి పొయ్యేది ఆ మాటలువిని. కానీ, తాను చిరునవ్వు నవ్వితే అలుసైపోదూ? అందుకని కళ్ళల్లో తెచ్చిపెట్టుకున్న కోపం చూచింది. నర్మదను అదిలించేది జలజ. నర్మద నవ్వుతూ పారిపోతుండేది. జలజ వెనకనే పోయి నర్మద రెక్కపట్టుకొని దగ్గరకు తీసుకొని, బుగ్గలను చేతులతో రాస్తూ, మనసులో అవును... బావంటే సామాన్యుడామరి. బావంటే మరచి పోవటానికి రెండేళ్ళయింది, కంటికన్నా

కనుపించారా? రానీలే ముక్కుపట్టుకొని నాలుగూ అడిగేస్తాను, అనుకునేది.

ఏమే అక్కా, బావతోటి వెళ్ళిపోతావు గాబోలు, యిక్కడ వంటరిగా ఎలావుండేదే? అనేది నర్మద జాలిగా.

నువ్వూ మాతో వచ్చేద్దువుగానిలే, అనేది జలజల లాలనగా;

మరి, నాన్నా అమ్మా యిక్కడ వొంటరిగా వుండొద్దక్కా.

మరి, నీ మొగుడు, నిన్ను తీసుకెళ్తానంటే, అమ్మా, నాన్నా, అంటూ కూచుంటావేమిటి? ఏమీ అనవు. రాజుగారితోటే రాణీగారు.

మరి, నా రాజు అమ్మా, నాన్నా దగ్గరే, ఎప్పుడూ వుండనిచ్చేవాడైతే నే చేసుకుంటాను, అనేది నర్మద. జలజ నిండుగా నవ్వేది.

ఎప్పుడూ యింట్లో కూచుంటే ఆనందమేముంటుంది. తానూ, వారూ కలసి శుభ్రంగా ఒక వూరుఉంచి, యింకోవూరు తిరుగుతుండాలి. తనను రెక్కపట్టుకొని రైల్లో, బండ్లో యెక్కిస్తుంటే, అందరిముందరా తనకు సిగ్గుగావుంటుంది. చూసినా వాళ్లల్లా, తమనుగురించి 'చిలుకా గోరింకల్లాగా' అనుకోవాలి.

వారు రాగానే తాను ఎదుటపడదు. తన చెవుల్లో గింగురుమనేటట్లు, జలజేది, జలజేది, అని ఆయన ఫదిమాట్లు అనాలి. రెండేళ్ళనుంచీ లేని తొందర, అప్పుడు ముంచుకొస్తుంది గాబోలు. మొట్టమొదట వారి తోటి తానేం మాట్లాడుతుందోమరి. ఏంమాట్లాడుతుంది. ఏదో చెప్పబోయి ఏదో చెబుతుంది. ఆయన నవ్వుతారు. తనకు కోపమొస్తుంది. ఎంత కొంటెతనం. తనను పేరెట్టి పిలవాలట. లేకపోతే పలకరట. అవ్వ! ఎక్కడైనా వుందా. పంతం నెగ్గించుకుంటారు. లేకపోతే అటు మొహంపెట్టి వులుకా-పలుకా?

ఆయన సోమవారంనాడు వస్తున్నానని టెలిగ్రాం యిచ్చారు. ఇంకెన్నాళ్ళు. నాలుగురోజులు ఇవ్వాళ్ళ గడిస్తే మూడే. రేపు గడిస్తే యింక రేపేగా. ఎలా వున్నారో. అక్కడ సరైనా తిండా తిప్పలాచిక్కిపోయి వుంటారు. అందుకనే తాను నిశ్చయం చేసుకుందిగా ఈసారి పట్టుబట్టి ఆయనతో బయలుదేరాల్సిందే. ఏమన్నాసరే. యిక వుండదు. పిచ్చిపిల్ల నర్మద తనను విడచివుండలేదు. తీసుకెళ్ళి నెలరోజు లుంచుకొని పంపించెయ్యవచ్చు.

లెక్కపెట్టి, లెక్కట్టి రేపొస్తారు అనుకుంది జలజ. నర్మద హుషారు చెప్పటానికి వీలులేదు. ఎగురుతున్నది. గంతులేస్తున్నది. పాడుతున్నది.

ఈ తెల్లవారితే వారొస్తారు. జలజ కారో జంతా, ఏమిటోగావుంది. తానెక్కడకో తేలిపోతున్నట్లనిపించింది. ప్రొద్దుటేలేచి శుభ్రంగా ఆయనొచ్చేవేళకు టాయిలెటవాలి. అసలు యీరోజు యింతమందకొడిగా నడుస్తున్నదేమిటి. సాయంత్రమెప్పుడౌతుందో ఇవాళ తెల్లవారుతుందో లేదో జలజ మనసంతా చీకటి తెచ్చుకుందామని ప్రయత్నించింది. రేపుఆయనొచ్చేటప్పటికి, క్రిందటేడుకు దసరాబెంగుళూరు సిల్కుచీర, నీలంది, ఆయన కొన్నదే,కట్టుకుంటుందితాను. అదంటేఆయన కిష్టం దానిపైకి ఎరుపురంగు ముఖమల్ బ్లౌజు బాగుంటుంది. పూలన్నీ కోసి మాలలుగట్టాలి. మల్లెచెట్టు వుడిగిపోయింది. మందారపూలున్నాయిగా. నైట్‌క్వీన్ మంచి వాసనేగాని, మాలగట్టే దెలా, పెట్టుకునే దెలా? కొమ్మలు పెట్టుకోవాల్సిందే తలలో. మొత్తం దూసుకొచ్చి టేబిలుమీద ఆయన ఫొటోముందు పోస్తేసరి.

జలజకు గుండెలు ఆనందంతో పొంగి పోతున్నాయి. ఇవాళే యింకో గంటలో, యింటిముందు బండి ఆగుతుంది. నాన్నగారు పోయినారు స్టేషనుకు కాఫీ తాగుతుంటే కాఫీ వొలికినయ్. ఇవాళ తన మనసుగాని, తన శరీరంగాని, తాను చెప్పినమాటే వినటం లేదు, అనుకుంది జలజ.

జలజ గదిలో కూచుని కిటికీలోంచి బజారులో వచ్చేవాళ్ళను చూస్తున్నది. బండి చప్పుడైతే వింటున్నది. ప్రతి బండీ తమ యింటిముందే ఆగినట్టుంటుంది జలజకు.

నర్మద సరేసరి, ప్రొద్దుటనుంచీ వీధి అరుగు మీదనే కూచుంది.

బావేడి అక్కయ్యా, బావ రావటం లేదు, నాన్నగారొక్కరే వస్తున్నారు. నర్మద వాకిట్లో నిలబడే అంటున్నది.

జలజకు బలే కోపమొచ్చికది. చిరాకేసింది. యేడుపు గూడా వచ్చింది. ఇవాళ చేసిన పనులన్నీ వృథాయేనా అనుకుంది జలజ.

నాన్నగారు వణికిపోతూ యింట్లోకివచ్చారు. జలజకు కళ్ళవెంబడి నీళ్ళు తిరిగినయ్. కిటికీ దగ్గర్నుంచి లేవనేలేదు.

నడిమింట్లోనుంచి అమ్మ యేడుపు వినిపించింది జలజకు. ఏమన్నా...ఆయనకు సుస్తీగా వుందని టెలిగ్రాం వచ్చిందేమో? అయ్యో భగవంతుడా! జలజకు వణుకుపుట్టింది. లేచి వెళ్ళింది యింట్లోకి. అమ్మ తల నేలకేసి కొట్టుకుంటున్నది. అయ్యో భగవంతుడా! నాన్నగారు ఎక్కడకో వెళ్ళిపోతున్నారు. ఏమిటా తొందర. తనకెవరూ యేం చెప్పరేం? ఎవరూ మాట్లాడరు.

అమ్మా...అమ్మా...అమ్మా నర్మద హెచ్చుస్థాయిలో ఎత్తుకుంది. నాన్నగారు వెళ్ళిపోయారు అమ్మా...జలజ యేడుస్తూ కూలబడింది. భగవంతుడా...ఎవరూ చెప్పరేం అసలు సంగతి.

* * *

అలయపు గూటిలో పావురాయి వొత్తుకున్నట్లుగా జగన్నాథం గుండెల్లో యిమిడిపోవలసిన తను, పక్కమీద యేడ్చియేడ్చి, యేడవటానికి గూడా శక్తిలేక పడిపోయింది జలజ.

అమ్మ చెప్పకపోతే తనకు తెలియకపోతుందా, పేపరు చెప్పింది. రైలు పడిపోయింది. నదిలో కూలిపోయింది. తన జీవితమే కూలిపోయింది. అమ్మానూ నర్మదా అవతలగదిలో యేడుస్తున్నారు. తన నెవరూ పలుకరించరు. అయ్యో... అయ్యో... రైలు పడిపోయింది. నాన్నగారు అక్కడికే పోయినారు. ఆశ్లేమైనా వుందేమోనని. ఇక యీ జన్మకు కాదు. ఈ జీవితానికి కాదు. ఈ కళ్ళకు కాదు. వారినింక తాను చూడలేదు, అనుకుంది జలజ.

మర్రోజు ప్రొద్దున నాన్నగారు, వాకిట్లో అడుగుపెట్టగానే బావురుమన్నారు.

ఇంక యేమీ ఆశలేదు, నాన్నగారికి కనపడలేదు శవంకూడా.

జలజకు స్పృహలేదు. ఇక యేడవటం చేతకాదు. కన్నీరు యింకిపోయింది. చైతన్యం లేదు. తన జీవితం నాశనమైంది. తన బ్రతుకు బద్దలైంది. వారింక కనపడరు. టేబిలుమీద ఆ ఫోటో ఎందుకు?

ఆయన ప్రాణంపోయేటప్పుడు జలజా జలజా అని ఎంత ఆక్రోసించి వుంటారో.

ఎంత అదృష్టహీనురాలు తాను.

పదిహేడేళ్ళకే పసుపూ కుంకుమా కరువా? బ్రతకటం దేనికి? బ్రతికి ఏం బావుకుంటుంది తాను? తననుచూసి అమ్మా నాన్నా గుండెలు పగిలిపోయేటట్లుగా యేడుస్తున్నారు. నర్మద, యేడ్చియేడ్చి చచ్చిపోతుందేమో. తానిక బ్రతకలేదు, ఇవాళ్టికి మూడురోజులనుంచీ యింట్లో అంతా యేడుపే. తాను పోయి ఆయనను కలుసుకుంటుంది. ఇంకేదైనా లోకమనేది వుంటే అక్కడనే తాము హాయిగా వుంటారు.

అమ్మా, నాన్నా...నర్మదా... నా తల్లీ వెళ్ళిపోతున్నాను, వెళ్ళిపోతున్నాను వారిదగ్గరకు వెళ్ళిపోతున్నాను. నర్మదా బెంగపెట్టుకోకు నా తల్లీ...నీ రాజును యింటినుంచి కదలనియ్యకు; ఏపూరు పోనియ్యకు జాగ్రత్త.

సుఖంగా బ్రతుకు నీ అక్క అదృష్టహీనురాలు అమ్మా...నాన్నా...నర్మదా నా తల్లీ

జలజ విషం పుచ్చుకొని చచ్చిపోయింది. ప్రొద్దుట పక్కమీద జలజ శవం ఆ సంగతి చెప్పింది.

నర్మదకు స్పృహలేదు.

తల్లీ, తండ్రీ తలలు పగులకొట్టుకొన్నారు.

* * *

కర్మకాండలన్నీ జరిగిపోయిన తర్వాత, నర్మద బయట పంచలో కూచుని అక్కను తలచుకొని యేడుస్తుంటే బయట బండి ఆగిన చప్పుడైంది.

హాస్పిటలు వాళ్ళు కట్టినకట్లతో వొంటిచెయ్యి కుంటి కాలు జగన్నాథం, వాకిట్లో అడుగు పెట్టుతూ 'జలజా' అని పిలిచాడు.

నర్మద వొక్కపెట్టున యేడ్చింది. ఇంట్లో వాళ్ళ యేడుపులు ఆకాశాన్ని ఆవరించినయ్.

* * *

ఇంకేం వ్రాయను? ఇక వ్రాయలేను. రైలు పడిపోయింది. రైలు పడిపోయింది. నదిమీద నడుస్తూ రైలు పడిపోయింది. ★